క్లుప్తంగా

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



తాగునీటి పైపు లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ప్రాజెక్ట్ ప్రవేశపెట్టిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం గుడిమెళ్లంక శివారు టి.సావరంలో వాటర్ ట్యాంకు నిర్మాణం పనులకు, జేజేఎంలో మంజూరైన పైపులైను నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే మేడిచర్ల పాలెం, లక్కవరం గ్రామాల్లో ఇదే పథకంలో మంజూరైన పైపులైను నిర్మాణ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెజిటబుల్ స్టాల్ పరిశీలన

మలికిపురం: ప్రకృతి సిద్ధమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలని లక్కవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పావని, భవానీలు గర్భిణులు, బాలింతలకు సూచించారు. శనివారం లక్కవరం పీహెచ్‌సీ వద్ద ప్రకృతి సిద్ధంగా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ఇతర వాటిపై ఏర్పాటు చేసిన వెజిటబుల్ స్టాల్‌ను వారు పరిశీలించారు. రైతు నుంచి నేరుగా ప్రకృతి సిద్ధమైన ఆహారం అందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ నేచురల్ ఫార్మింగ్ (రైతు సాధికార సంస్థ) ప్రకృతి సిద్ధంగా పండించిన వాటిని ఈ స్టాల్‌లో విక్రయాలు సాగించింది. సీహెచ్‌వో సత్యవతి, సూపరింటెండెంట్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. వేదపండితులు స్వామికి తులసీ పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఉరదాలమ్మ తీర్థం

ఆలమూరు: మండలంలోని మోదుకూరులో వేంచేసిన ఉరదాలమ్మ అమ్మవారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన జాతర సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన గరగ నృత్యాలు, కేరళ నృత్యాలు, విచిత్ర వేషధారణ, శక్తి వేషాలు అలరించాయి.

కిడ్నీ బాధితుడికి సాయం

రావులపాలెం: గ్రామానికి చెందిన గీసాల లోవ రాజుకి రెండు కిడ్నీలు పాడైపోయాయి. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి. పేదరికంతో ఉన్న వారు స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు శనివారం రూ.13 వేల నగదు సాయాన్ని బాధితుడికి అందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

రావులపాలెం: మండలంలోని రావులపాడు ఎంపీయూపీ స్కూల్, ఊబలంక మదర్ థెరిసా ఆశ్రమంలో పిల్లలకు శనివారం సాయి దినేష్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సీఆర్‌సీ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే విద్యార్థులకు ఐడెంటిటీ కార్డ్స్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆశ, కిషోర్, నడింపల్లి వర్మ, హరీష్ రెడ్డి, నాగార్జున చౌదరి, పి.వెంకటావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట తప్పని మడమ తిప్పని జగన్‌కే మన ఓటు

జెడ్పీ చైర్మన్ విప్పర్తి



ముక్తేశ్వరంలో డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: మాట తప్పని మడమ తిప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మరో సారి మనం ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన ముక్తేశ్వరం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ క్రాంతి పథం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విప్పర్తి వేణుగోపాలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పదవీ కాలంలో 124 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. అందుకు కృతజ్ఞతగా అసెంబ్లీ స్థానానికి, పార్లమెంట్ స్థానానికి రెండు బటన్లు నొక్కి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మహిళ సంఘాల సభ్యులు తమ భర్తలకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఆసరా సాయాన్ని సీఎం జగన్ అందజేశారన్నారు. మండలంలో నాలుగు విడతలుగా 1369 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.43.97 కోట్ల ఆసరా ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి విప్పర్తి వేణుగోపాలరావు, డ్వాక్రా సంఘ మహిళలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాలుగో విడత ఆసరా సొమ్ము 1369 సంఘాలకు రూ.10,98,33,408లు చెక్కులను విప్పర్తి వేణుగోపాలరావు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, ఎంపీడీఓ పి.సూర్యనారాయణమూర్తి, ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, నాయకులు మట్టపర్తి వెంకటరమణ, నంబూరి వెంకటరమణరాజు, బొంతు రాజేంద్రప్రసాద్, కనుమూరి సత్యనారాయణరాజు, వాసంశెట్టి తాతాజీ, సరిపల్లి కన్నబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక భరోసాకు ఆసరా



రాజోలు డిగ్రీ కళాశాలలో ఆసరా కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక భరోసాకు ఆసరా పథకం అమలు చేసిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 15న వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, నాయకులు మట్టా ఏడుకొండలు, తెన్నేటి కిషోర్, కొప్పాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చర క్షేత్రంలో క్లోక్ రూం ప్రారంభం



మండపల్లి శనైశ్చర క్షేత్రంలో క్లోక్‌రూం ప్రారంభించి భక్తుని బ్యాగు భద్రపరుస్తున్న ఈఓ విజయలక్ష్మి

కొత్తపేట: మండలంలోని మండపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శనివారం క్లోక్ రూం ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండపల్లి క్షేత్రానికి ప్రతి శనివారం ముఖ్యంగా శనిత్రయోదశి పర్వదినాల్లో దేశం నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారి వెంట తెచ్చుకున్న బ్యాగులు, ఇతర సామగ్రిని ఇంతవరకూ స్నానాలకు వెళ్లినప్పుడు, పూజలు నిర్వహించినప్పుడు, స్వామివారి తైలాభిషేకం, దర్శనానికి వెళ్లినప్పుడు తమ కూడానే తీసుకువెళ్లవలసి వస్తుంది. ఈ ప్రయాసలను గుర్తించిన దేవస్థానం అధికారులు ఆ బ్యాగులు, సామగ్రిని భద్రపర్చుకోవడం కోసం క్లోక్ రూంను ఏర్పాటు చేశారు. ఆ విభాగాన్ని శనివారం ఈవో, ఏసీ కె.విజయలక్ష్మి ప్రారంభించారు.

తైలాభిషేకాలు

మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ఈఓ, ఏసీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,20,368, ఎంటల ద్వారా రూ.1,333, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.43,579 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు. స్వామిని భారతి గ్రూపు వైస్ ప్రెసిడెంట్ దుట్ట ప్రదీప్ (కోల్‌కతా) దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకం జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయనకు వేదాశీస్సులు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పాలనకు ఆకర్షితులై ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామ బేడబుడగజంగం సంఘ సభ్యులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సంఘ ప్రెసిడెంట్ నీరుకొండ వెంకన్న, సభ్యులు నీరుకొండ బాపనయ్య, నీరుకొండ వెంకట సుబ్బన్న, పుట్టా కృష్ణ, పేర్ల పిచ్చయ్య, నీరుకొండ వెంకన్న, నీరుకొండ దత్తుడు, నీరుకొండ దుర్గారావు, నీరుకొండ నవీన్, నీరుకొండ పోసియ్య, నీరుకొండ శంకర్, కళ్యాణ్ సాయి, నీరుకొండ సాయిబు, గోటూరి వెంకటరావు తదితర 50 మంది వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువా కప్పి ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పద్మరాజు, కొత్తపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉర్రింకల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు



అంతర్వేదిలో కొలువైన నీలకంఠేశ్వరస్వామి

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి 15వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. అంతర్వేది దేవస్థానానికి నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా కొనసాగుతోంది. అంతర్వేది క్షేత్రానికి క్షేత్రపాలకుడిగా నీలకంఠేశ్వరస్వామి ఉన్నారు. ఈయన కల్యాణం అనంతరం లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణం జరగడం ఇక్కడ విశేషం. ఆదివారం ఉదయం అంకురార్పణ, రాత్రి విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణ, 12న ఉదయం స్వామికి నిత్యోపాసన, రాత్రి నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని ఏసీ సత్యనారాయణ అన్నారు. మిగిలిన మూడు రోజుల్లో కల్యాణోత్సవానికి సంబంధించిన విశేష కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రానున్న రోజుల్లో బీజేపీ బలోపేతం



కొత్తపేటలో కొబ్బరి వలుపు కార్మికులతో రాష్ట్ర బీజేపీ నేత పాలూరి

కొత్తపేట: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న సంచలన నిర్ణయాలతో బీజేపీ బలోపేతం కావడం ద్వారా తన శక్తిని చాటుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. బీజేపీ అధిష్ఠానవర్గం ఆదేశాల మేరకు 'పల్లెకు పోదాం' పేరిట పాలూరి నాయకత్వంలో బీజేపీ నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. సత్యానందం మాట్లాడుతూ గ్రామాల్లో బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల ఏర్పాటుతో పార్టీని బలోపేతం చేయడం ద్వారా రానున్న రోజుల్లో తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో పల్లెకు పోదాం కన్వీనర్ గొలకోటి వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం, మండల పార్టీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి, ఉపాధ్యక్షుడు అంబర్కాన సుధాకర్, పార్టీ వివిధ మోర్చాల జిల్లా కమిటీ ప్రతినిధులు ఇళ్ల పల్లంశెట్టి, బల్ల రాజు, కుడుపూడి దావీదురాజు, అంగర గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ నేతలు శనివారం బి.దొడ్డవరంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలు పంచారు. గ్రామాల్లో బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల ఏర్పాటుతో బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేస్తున్నామని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, పార్టీ నేతలు పసుపులేటి మహాలక్ష్మీరావు, కంకిపాటి సుబ్బారావు, ఏడిద బాబులు, వేగి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీనివాసరావు, అరిగెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో నైపుణ్యానికి టీఎల్‌ఎం మేళా దోహదం

సఖినేటిపల్లి: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు వీలుగా ఉపాధ్యాయుల్లో నైపుణ్యం పెంచేందుకు టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళా దోహదపడుతుందని ఎంఈవో–1, 2 డి.కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు ఎంపీపీఎస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఫిబ్రవరి నెల పాఠ్య ప్రణాళికలో విద్యార్థులకు బోధించే అంశాలపై ఈ మేళా ఏర్పాటు చేశారు. ఇందులో వినూత్న పద్ధతిలో తయారు చేసిన బోధనా పరికరాలను ఉపాధ్యాయులు ప్రదర్శించారు. వీటిని పరిశీలించిన ఎంఈవోలు, బోధనా పరికరాలు విద్యార్థులకు ఎంతో మేలు చేకూర్చే విధంగాను, సులువుగా బోధనలు అర్థమయ్యే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. కాగా న్యాయనిర్ణేతలుగా ప్రధానోపాధ్యాయులు జె.కనక లింగేశ్వరరావు, సీహెచ్.సుజాత, డి.జగదీప్ వ్యవహరించారు. కాగా ప్రతి ఆరు నెలలకోసారి టీఎల్‌ఎం మేళా జరుపుకునేలా సిద్ధంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం: మానేపల్లి సుబ్బరాయ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వచ్చే నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శనివారం 1990 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, తహసీల్దార్ కార్యాలయ ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఆయన మోటివేషన్ తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించే విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తామని దేవళ్ల తెలిపారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన



రావులపాలెం ఇందిరా కాలనీ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: స్థానిక ఇందిరా కాలనీలో ఉన్న డ్రైనేజీ వల్ల దుర్గంధం, దోమలు, మురుగుతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న స్థానికుల సమస్యకు శాశ్వత పరిష్కారంగా చేపట్టిన సీసీ డ్రైనేజ పనులను శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరిశీలించారు. పనులు జరుతున్న విధానాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో శిలాఫలకానికే పరిమితమైన ఈ పనిని జగనన్న ప్రభుత్వంలో పూర్తి చేసి చూపనున్నామన్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన మురుగుతో అవస్థలు పడుతున్న ఇందిరా కాలనీ వాసుల బాధలు తీర్చడానికి వెంటనే డ్రైనేజీ నిర్మాణం మొదలుపెట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామని జగ్గిరెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో మాట ఇచ్చామన్నారు. ఆ మాటను నిలబెట్టుకునే విధంగా పనులను ప్రారంభించామన్నారు. నేడు శరవేగంగా జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

మాతృ, శిశు మరణాల నివారణ పీఎంఎంఎస్‌ఏతో సాధ్యం



పెదపళ్లలో బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయికిషోర్

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్, డి.మల్లికార్జున అన్నారు. పీఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏలో సుమారు 112 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిది లేక పదో తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.